క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజికల్‌సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులను బోధించేందుకు తాత్కాలిక పద్ధతిలో అధ్యాపకులను నియమిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుభాషిణీదేవి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు నేరుగా సాంఘిక సంక్షేమ గురుకులంలో ఈ నెల 5వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టుల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి 55 శాతం మార్కులతో పాటు బీఈడీ అర్హత ఉన్నవారు అర్హులని ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఆత్మకూరు: మండలంలోని నీరుకుళ్ల క్రాస్‌రోడ్డు వద్ద 3 నెలల క్రితం మండలంలోని పెంచికలపేటకు చెందిన కుండె మహేష్ సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. కాగా బాధితుడు ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించగా రైటర్ శ్రీనివాస్ సీఈఐఆర్ పోర్టల్‌లో ఫోన్ ట్రాక్ చేయగా సెల్‌ఫోన్ లభ్యమైంది. దీంతో సీఐ రవిరాజు శుక్రవారం బాధితుడు మహేష్‌కు సెల్‌ఫోన్ అప్పగించారు.

వీఓఏల హర్షం..



శాయంపేట : రాఖీ పండుగ కానుకగా వీఓఏల వేతనాలను పెంచుతూ సీఎం కేసీఆర్ ప్రకటించడం పట్ల మండలంలోని వీవోఏలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలంలోని దామెరలో సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఝాన్సీ, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుండు రాము, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృపాకర్‌రెడ్డి, నాయకులు శంకర్, రమేష్, రాజేందర్, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

లతకు సెంట్రల్ వర్సిటీ డాక్టరేట్

కాజీపేట: హనుమకొండ జిల్లా కేంద్రంలోని జీఎంఆర్ బృందావన్ కాలనీకి చెందిన గాదెపాక లతకు గౌరవ డాక్టరేట్‌ను హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రకటించింది. కంప్యూటర్ సైన్స్ విభాగం నుంచి ప్రొఫెసర్ సూరంపుడి బాపిరాజు పర్యవేక్షణలో స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ ఇన్‌ఫర్మేషన్ సిస్టమ్ విభాగంలో ఇన్‌వెస్టిగేషన్ ఆఫ్ ప్రైవసీ ప్రిసర్వింగ్ మెథడ్స్ ఫర్ క్లాసిఫికేషన్ అండ్ క్లస్టరింగ్ ఆఫ్ డిస్ట్రిబ్యూటెడ్ డాటా అనే అంశంపై లత పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్స్ విభాగంలో గౌరవ డాక్టరేట్‌కు ఎంపికైన తొలి మహిళగా లతకు అత్యంత అరుదైన గౌరవం దక్కింది.

గడపగడపకు సంక్షేమ పథకాలు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చీఫ్‌విప్

రామన్నపేట: తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత ఒక్కో డివిజన్‌కు రూ.50 కోట్ల నిధులతో అభివృద్ధి చేస్తూ గడపగడపకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు తీసుకెళ్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 11, 29వ డివిజన్లలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మేయర్ సుధారాణితో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం శంకుస్థాపన చేసి, లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో రైతు రుణ విమోచన చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, లైబ్రరీ చైర్మన్ అజీజ్ ఖాన్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో ఘనంగా తీజ్ వేడుకలు

కాజీపేట అర్బన్: 44వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో గురువారం రాత్రి తీజ్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తీజ్ ఉత్సవాలు గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక అని కొనియాడారు. అనంతరం యువతులతో కలిసి ఆయన ఉత్సాహంగా నృత్యం చేశారు. మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ, కంకణాల సంపత్‌రెడ్డి, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



పరకాల : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి నిరసన తెలుపుతున్న పీఆర్టీయూ నాయకులు

పరకాల: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్‌బాబు, మండల ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టపరిచే విధంగా ఉన్న సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్మిడి రామన్న, దగ్గు తిరుపతిరావు, బురుగు శంకర్, నాగరాజు, సాబీరొద్దిన్ పాల్గొన్నారు.

ఐనవోలు: రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు గుదిబండగా మారిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరునగిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలశాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మండలంలోని వివిధ పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపిన అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం వలన ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం కలుగుతుందన్నారు. ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గుర్రపు రాజు, చంద్రమోహన్, రాష్ట్ర నాయకులు రాజేంద్రప్రసాద్, పింగిలి సత్యనారాయణరెడ్డి, సోమయ్య, శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్‌రావు, మార్కండేయ, కొమురయ్య, మహిపాల్ రెడ్డి, ఎల్లయ్య, అమిత, సుజాత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

నూతన పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచుకాల లింగారావు డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినంగా పరిగణిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన మహాధర్నాకు మద్దతుగా భోజన విరామ సమయంలో మండలంలోని పలు పాఠశాలల్లో ఆ సంఘం నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం లింగారావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చీకటి దినంగా, పెన్షన్ విద్రోహదినంగా పరిగణిస్తూ యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉమాదేవి, బాలోజు బ్రహ్మచారి, రవికుమార్, రాధిక, రవి తదితరులు పాల్గొన్నారు.



ఐనవోలు: నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు



ధర్మసాగర్ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

ధర్మసాగర్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం కలిగించే సీపీఎస్‌ను వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్టీయూ (టీఎస్) మండల అధ్యక్షుడు అనిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర, జిల్లా కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 01న పెన్షన్ విద్రోహదినం సందర్భంగా శుక్రవారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ మేరకు మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ సీపీఎస్ అంతం పీఆర్టీయూ పంతం అనే నినాదంతో పోరాటం చేస్తామని అన్నారు. సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ రమేష్, జిల్లా కార్యదర్శి శ్యామ్‌సుందర్, మాధవి, యమునశ్రీ, సంపత్‌రెడ్డి, రఘుపతి పాల్గొన్నారు.

పీబీనాట్‌తో గులాబీ పురుగును నిర్మూలించవచ్చు

ఎల్కతుర్తి: పత్తిపంటలో పీబీనాట్ పద్ధతి ద్వారా గులాబీ రంగు పురుగును అరికట్టవచ్చని, పురుగుల మందు వాడకాన్ని గణనీయంగా తగ్గించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండలంలోని పెంచికలపేట గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం, జాతీయ పత్తిపరిశోధన సంస్థ సహకారంతో పత్తిపంటలో గులాబీ రంగు పురుగు ఆశించకుండా నిర్మూలన చర్యలపై రైతులకు నూతన సాంకేతికతను (పీబీనాట్)పై శుక్రవారం అవగాహన కల్పించారు. పీబీనాట్‌పై ప్రతీఒక్క రైతు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మహేష్, భరద్వాజ్ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్‌రావు

సప్త గురుధామంలో వరలక్ష్మీ వ్రతాలు



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

వరంగల్: పవిత్ర శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ములుగురోడ్డులోని సప్త గురుధామంలో 151మంది ముత్తైదువులతో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించినట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో చేసుకునే వ్రతం కంటే సమష్టిగా పుణ్యక్షేత్రాల్లో చేసుకుంటే అధిక ఫలితం ఉంటుందని గురుదేవుల సన్నిధిలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టీలు బండారు సాయి నారాయణ, సోమ రామయ్య, మాదారపు సదాశివుడు, గండె ఉమాశంకర్, రాంరెడ్డి, వెంకటరమణ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పాలించే హక్కులేదు

ఎల్కతుర్తి: ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంతో పూర్తిగా విఫలమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పాలించే హక్కులేదని పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (పీపీఐడీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం రఘు ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నల్లధనాన్ని వెలికితీసి ప్రతీ సామాన్యుడి ఖాతాలో రూ. 15 లక్షలు జమా చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ మోసపూరిత పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అవలంభించిన పాతనోట్ల రద్దు, నిత్యవసరాల ధరల పెంపు, జీఎస్టీ విధానంతో సామాన్యులపై పెనుభారం పడిందన్నారు. గ్యాస్ సిలిండర్, పెట్రోల్, చమురు ధరలు పెంచి సామాన్యుల నడ్డీ విరుస్తుందన్నారు. గ్రామాల్లో జరిగే జాతీయ గ్రామీణ ఉపాధిహామీ డబ్బులు కూలీలకు సరియైన సమయంలో చెల్లించడంలేదని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ చేస్తున్న అరాచకంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారని విమర్శించారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన బీఆర్‌ఎస్ సర్కార్ మళ్లీ ఎన్నికలు వస్తుండడంతో మాయమాటలు చేప్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు మహ్మద్ రఫీ, సందెల వెంకన్న, రమేష్, ప్రభాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయల పోస్టులు భర్తీ చేయాలి

కరీమాబాద్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని విప్లవ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ అడిషనల్ కలెక్టర్ శ్రీవత్సకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ నోటిఫికేషన్లు కేవలం ఎన్నికల స్టంట్‌గా మారుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో దాదాపు 5 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. పోస్టుల భర్తీపై సర్కారు పూటకో మాట మార్చుతోందని విమర్శించారు. కార్యక్రమంలో పీవైఎల్, ఏఐకేఎంఎస్, పీడీఎస్‌యూ నాయకులు ఎలకంటి రాజేందర్, రాచర్ల బాలరాజు, అశోక్, రంజిత్‌కుమార్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన తెలిపి వరంగల్ అడిషనల్ కలెక్టర్ శ్రీవత్సకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నిర్మలాదేవి, రాజేశ్వరి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 11నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు వివరించారు. కనీస వేతనం, పింఛన్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత లాంటివి అమలు చేయాలని సూచించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, రుక్మిణి, లక్ష్మి, వనిత, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు : ఏసీపీ

కమలాపూర్: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పోలీస్‌శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా అధికారులు రౌడీ షీట్ కేసులు నమోదైన వారిపై నిఘా పెట్టారు. రానున్న ఎన్నికల్లో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా కౌన్సెలింగ్‌లు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో మండల పరిధిలోని రౌడీషీటర్లకు కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్సైలు కరుణాకర్, సీమా ఫర్హీన్ ఉన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏసీపీ డేవిడ్‌రాజ్

మేనిఫెస్టోలో ముదిరాజ్ రిజర్వేషన్ అంశం చేర్చాలి



నినాదాలు చేస్తున్న శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు

హన్మకొండ: అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ముదిరాజ్ రిజర్వేషన్ అంశాన్ని రాజకీయ పార్టీలు చేర్చాలని ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని అసోసియేషన్ కార్యాలయంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ రిజర్వేషన్ సౌకర్యం లేక ముదిరాజ్ కులస్తులు అన్ని రంగాల్లో వెనుకబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి చేర్చాలనే అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలన్నారు. సమావేశంలో మెపా వ్యవస్థాపక బాధ్యులు, అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు నీరటి రాజు, బోనాల రమేష్, సింగారపు రామకృష్ణ, పెండ్యాల కృష్ణ, పిట్టల రమేష్ పాల్గొన్నారు.

అగ్రరాజ్యంగా ఎదుగుతున్న భారత్

హసన్‌పర్తి: రానున్న 20 ఏళ్లల్లో భారతదేశం అగ్రరాజ్య జాబితాలో చోటు సంపాదించి, ప్రపంచాన్నే శాసించే స్థాయికి ఎదుగుతుందని ఐనా టెక్ వేవ్ వ్యవస్థాక చైర్మన్ దామోదర్‌రావు అన్నారు. భీమారంలోని ఎస్‌వీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు శుక్రవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధి అవకాశాల కోసం ఎదురు చూడకుండా స్వతహాగా ఐటీ కంపెనీలను ఏర్పాటు చేసుకుని మరో పది మందికి ఉద్యోగాలు కల్పించాలని సూచించారు. ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు మాట్లాడుతూ చదువులో ప్రతిభ కనబరిచి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఫీజుల్లో మినహాయింపు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అతిథిని సత్కరించారు.



దామోదర్‌రావును సన్మానిస్తున్న తిరుమల్‌రావు

ఘనంగా బోనాల పండుగ

నడికూడ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పోచమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలెత్తి డప్పు చప్పుళ్లతో పోచమ్మ గుడికి చేరుకున్నారు. కంఠాత్మకూర్‌లో మేకలను బలిచ్చి నైవేద్యంగా సమర్పించారు. ఊరు, వాడ, పిల్ల, పాడి, పంటలు, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని పోచమ్మను వేడుకున్నారు. మండల కేంద్రంలో జరిగిన బోనాల వేడుకల్లో సర్పంచ్ ఊర రవీందర్‌రావు, బీఆర్‌ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు చందు ప్రత్యేక పూజలు చేశారు.



నడికూడలో బోనాలతో వెళ్తున్న భక్తులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు

శాయంపేట : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ అన్నారు. మండలంలోని మాందారిపేట స్టేజీ వద్ద పోలీస్ సిబ్బందితో కలిసి శుక్రవారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలని, సీట్‌బెల్ట్ పెట్టుకొని వాహనాలను నడుపాలని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి, ఫోన్ మాట్లాడుకుంటూ వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న ఎన్నికల్లో సమయంలో వాహనాల్లో మద్యం, డబ్బు తరలిస్తే చట్టపరంగా కఠి చర్యలు తీసుకుంటామని, ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగా దృష్టి వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పరకాల ఏసీపీ కిషోర్, సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్, పరకాల, ఆత్మకూరు సీఐలు, ఎస్సైలు ఉన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఈస్ట్ జోన్ డీసీపీ

నెలలు గడుస్తున్నా రోడ్డు వేయరా..!



ఒంటిమామిడిపల్లి చెరువుకట్ట, ముల్కలగూడెం మధ్య కంకర రోడ్డు

ఐనవోలు: బీటీ రోడ్డు వేస్తామని చెప్పి రోడ్డు తవ్వించి కంకర పోసి వదిలేశారని, నెలలు గడుస్తున్నా రోడ్డు పనులు పూర్తి చేయడం లేదని బీజేపీ జిల్లా కార్యదర్శి గుండెకారి కోటేశ్వర్‌రావు మండిపడ్డారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా రోడ్లు ధ్వంసమయ్యాయని దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఒంటిమామిడిపల్లి సింగారం రూట్‌లో డబుల్ రోడ్డు పేరిట మోరీలు తవ్వించి ఎక్కడి పనులు అక్కడే వదిలేశారని ఆరోపించారు. ఎడ్లబండ్లు, ఎడ్లు, కాలి నడకన వెళ్లేవారు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఒంటిమామిడిపల్లి చెరువుకట్ట ముల్కలగూడెం మధ్యలో కూడా కంకర రోడ్డుతో వాహనదారులు, గ్రామ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వాహనదారులు అదుపుతప్పి కింద పడుతూ తీవ్ర గాయాలపాలవుతున్నారని, కొందరు కాళ్లు, చేతులు పోగొట్టుకుని వికలాంగులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో స్థానిక ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

ఘనంగా ‘మేరా మిట్టి మేరా దేశ్’

ఎల్కతుర్తి: ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ప్రతీ ఇంటి నుంచి పిడికెడు మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర పోరాటంలో అసువులుబాసిన మహనీయులను స్మరించుకుంటూ చేపట్టిన పవిత్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మట్టిని సేకరించి ఢిల్లీకి పంపించేందుకు రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ పాల్పంచుకోవాలని కోరారు. అన్ని రాష్ట్రాలవారు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని, కానీ తెలంగాణలో మాత్రం బీఆర్‌ఎస్ నాయకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్, నాయకులు ఉసకోయిల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తకొండలో మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

కేయూ వీసీపై కఠిన చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

శాయంపేట : పీహెచ్‌డీ 2 ఇంటర్వ్యూలో దళిత విద్యార్థిని కించపరిచి పీహెచ్‌డీ ఇవ్వకుండా సంబంధిత ప్రొఫెసర్లుకు సంకేతాలు జారీ చేసిన కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ తాటికొండ రమేష్‌పై చర్య తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ నాగుల పవన్‌కల్యాణ్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీహెచ్‌డీ 2 అభ్యర్థుల ఇంటర్వ్యూను సంబంధిత ప్రొఫెసర్లు నిర్వహించాలనే నిబంధన ఉన్నప్పటికీ దానికి భిన్నంగా గత నెల 22వ తేదీన కేయూ వైస్ చాన్సలర్ తాటికొండ రమేష్ స్వయంగా పీహెచ్‌డీ 2 తెలుగు విభాగం ఇంటర్వ్యూలో పాల్గొనడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. ఇంటర్వ్యూలు పారదర్శంగా నిర్వహించామని ప్రచారం చేస్తున్న వీసీ ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులందరికీ ఎన్ని మార్కులు వచ్చాయో డిస్‌ప్లే చేసి నిరూపించాలన్నారు. విశ్వవిద్యాలయంలో దళితుల పట్ల వివక్ష చూపుతున్న వీసీపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరనున్నట్లు తెలిపారు. నాయకులు అంబేడ్కర్, మిన్ను, మనోజ్, మహేందర్, శివ నాగులు తదితరులు పాల్గొన్నారు.

త్రికూటేశ్వరాలయంలో కుంకుమార్చన



త్రికూటేశ్వరాలయంలో శివలింగానికి పూజలు చేస్తున్న రాజయోగి సిద్ధేశ్వరమహారాజ్

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామంలోని త్రికూటేశ్వరాలయంలో రాజయోగి సిద్ధేశ్వరమహారాజ్ మంగళ శాసనాలతో శుక్రవారం ఆలయంలో సామూహిక కుంకుమ అర్చనలు నిర్వహించారు. శ్రావణమాసంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొనడం వల్ల భక్తులకు లక్ష్మీకటాక్షంతో పాటు మాంగళ్యబలం పెరుగుతుందని ఆయన తెలిపారు. అంతకు ముందు ఆలయంలో శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

శాయంపేట / ధర్మసాగర్: ఈనెల 9వ తేదీన పరకాల కోర్టులో నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీఐ మల్లేష్, శాయంపేట ఎస్సై దేవేందర్, వేలేరు ఎస్సై హరిత, ధర్మసాగర్ పీఎస్ కోర్టు కానిస్టేబుల్ అశోక్ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. పరకాల కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని, కోర్టు కేసులు ఉన్నవారు హాజరై రాజీ కుదుర్చుకుని కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు. యాక్సిడెంట్, కొట్టుకున్న, చీటింగ్, వివాహ సంబంధం, దొంగతనం కేసులకు సంబంధించిన వారు ఆధార్‌కార్డుతో కోర్టుకు హాజరు కావాలన్నారు.